

శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు
నగదు : రూ. 5,48,015
బంగారం : 4 గ్రాముల 400 మిల్లీ గ్రాములు
వెండి : 16 గ్రాముల 400 మిల్లీ గ్రాములు
– భువనేశ్వర్/పూరీ



దేవతల ఆగమనం

మల్కన్‌గిరిలో బోడ జాతర ప్రారంభమైంది. దేవతామూర్తులను అలంకరించారు.
- 8లో



అనుమానాస్పద మృతి

పర్లాకిమిడిలో వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.
- 8లో

న్యూస్‌రీల్

మహిళలకు గొడుగుల పంపిణీ



గొడుగులు పంపిణీ చేస్తున్న క్లబ్ సభ్యులు

రాయగడ: మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక మహిళా వాకర్స్ క్లబ్ సభ్యులు శనివారం సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఇందులో భాగంగా రోడ్డు పక్కన చిరు వ్యాపారాలు చేసుకుని కుటుంబ పోషణ చేసుకుంటున్న మహిళలకు గొడుగులను పంపిణీ చేశారు. ఎండలో పొట్ట కూటి కోసం వ్యాపారాలు చేసుకుంటున్న వారి దీన పరిస్థితిని గమనించిన క్లబ్ సభ్యులు ఈ మేరకు వారికి అండగా నిలిచారు. క్లబ్ అధ్యక్షురాలు కొరాడ రజిత, కార్యదర్శి కొరాడ భారతి, కోశాధికారి గెంబలి స్వప్న పాల్గొన్నారు. మరి కొన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని అధ్యక్షురాలు రజిత తెలిపారు.

లోక్ అదాలత్‌లో 2,348 కేసుల పరిష్కారం



రాయగడ: కేసులను పరిష్కరిస్తున్న న్యాయవాదులు

రాయగడ: స్థానిక సివిల్ కోర్టు ప్రాంగణంలో శనివారం నిర్వహించిన లోక్‌అదాలత్‌లో కాసీపూర్, రాయగడ, బిసంకటక్, గుణుపూర్, పద్మపూర్, మునిగుడ కోర్టుల్లో కొన్నాళ్లుగా పెండింగ్‌లో ఉన్న 2,348 కేసులు పరిష్కారమయ్యాయి. జిల్లా జడ్జి సత్యనారాయణ షడంగి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో 51,19,464 రూపాయలను జరిమానా కింద వసూలయ్యాయి. న్యాయవాదులు, లీగల్ సెల్ విభాగానికి చెందిన అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం



సంఘటన స్థలం వద్ద రాజా మృతదేహం

రాయగడ: జిల్లాలోని చందిలి పోలీస్ స్టేషన్ పరిధిలో గల దేవ్‌పూర్ గ్రామ సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. మృతుడిని బిసంకటక్ సమితి ముండాబలి గ్రామానికి చెందిన రాజా కౌసల్య (28) గా గుర్తించారు. సమాచారం తెలుసుకున్న చందిలి పోలీస్ స్టేషన్ ఐఐసీ ప్రసన్న కుమార్ బెహర, సబ్ ఇన్‌స్పెక్టర్ అశుతోస్ సాహులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోస్టుమార్టం కోసం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు తెలియజేసిన వివరాల ప్రకారం ... రాజా తన బైక్‌లో స్వగ్రామం ముండాబలి నుంచి రాయగడకు వస్తున్న సమయంలో దేవ్‌పూర్ గ్రామ సమీపంలో ఎదురుగా వస్తున్న ఒక వాహనం బలంగా ఢీకొంది. ఈ సంఘటనలో రాజా అక్కడికక్కడే మృతి చెందాడు. అయితే ఢీకొన్న వాహనం ఆగకుండా వెళ్లిపోయింది. కేసు నమోదు చేసిన పోలీసులు వాహనం ఆచూకీ కోసం గాలిస్తున్నారు.

యువకుని మృతదేహం స్వాధీనం



చెట్టుకు వేలాడుతున్న యువకుని మృతదేహం

రాయగడ: గుర్తు తెలియని యువకుని మృతదేహాన్ని కాసీపూర్ సమితి టికిరి పంచాయతీలోని అండరాకంచ్ పోలీసులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. ఉండురుకోన కూడలి సమీపంలోని చెట్టుకు వేలాడుతున్న యువకుని మృతదేహాన్ని చూసిన కొందరు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడా లేక మరేమైన కారణం ఉందనే విషయం పోస్టుమార్టం నివేదికలో వెల్లడవుతుందని పోలీసులు తెలిపారు.

వాట్సాప్ ఆధారిత పౌర సేవలకు శ్రీకారం

- మొబైల్ యాప్ ద్వారా కుల, ఆదాయ – నివాస ధ్రువీకరణ పత్రాల జారీ



ఒప్పంద పత్రాలపై సంతకాల దృశ్యం

భువనేశ్వర్: రెవెన్యూ సంబంధిత సర్టిఫికెట్లు పొందే ప్రక్రియను సులభతరం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం సన్నద్ధం అవుతోంది. ఈ ఏడాది ఏప్రిల్ నెల నుంచి మొబైల్ అప్లికేషన్లను ప్రారంభించి రెవెన్యూ విభాగం సంబంధిత పౌర సేవల్ని అందజేసేందుకు ప్రభుత్వం యోచిస్తోంది. ఈ నేపథ్యంలో కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ తదితర పత్రాల జారీ సులభతరం చేయనుంది. ఈ సేవలు కల్పించేందుకు మొబైల్ యాప్ ప్రవేశ పెడుతుంది. ఈ సదుపాయం రాష్ట్ర ప్రభుత్వం ఏప్రిల్‌లో ప్రారంభించేందుకు యోచిస్తుందని రాష్ట్ర రెవెన్యూ, విపత్తు నిర్వహణ శాఖ మంత్రి సురేష్ కుమార్ పూజారి ప్రకటించారు. ఈ చొరవ ద్వారా లబ్ధిదారులకు తహసీల్ కార్యాలయం చుట్టూ చక్కర్లు కొట్టే బెడద తొలగించడం లక్ష్యంగా మంత్రి పేర్కొన్నారు.

కొత్త యాప్‌తో, పౌరులు తమ స్మార్ట్ ఫోన్ల నుంచి నేరుగా కులం, ఆదాయం, నివాస ధ్రువీకరణ పత్రాలు వంటి ముఖ్యమైన పత్రాల కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. ఇప్పటి వరకు ఈ పత్రాల కోసం పౌరులు వ్యయ ప్రయాసలకు లోనయ్యేవారు. ఈ యాప్‌తో ప్రజలు ఇప్పుడు తహసీల్ కార్యాలయాలను సందర్శించాల్సిన అవసరం లేకుండానే కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తు చేసుకోవచ్చు అని మంత్రి పూజారి వివరించారు.

దరఖాస్తు తేదీ, సర్టిఫికెట్ ఉద్దేశం వంటి కీలక వివరాలను అప్లికేషన్ నమోదు చేస్తుంది. ఈ యాప్ సేవల సామర్థ్యాన్ని పెంపొందించే దిశలో విభాగం సన్నాహాలు చేస్తుంది. ప్రధానంగా నిర్ధారిత కాల పరిమితిలో దరఖాస్తుదారులకు ఆశించిన ధ్రువీకరణ పత్రం జారీ పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. ఇందుకు అవసరమైన సమగ్ర మార్గదర్శకాలను రెవెన్యూ శాఖ రూపొందిస్తుంది.

ఈ యాప్ ద్వారా అనుబంధ సమాచారం అప్‌లోడ్ చేసే బాధ్యతను తహసీల్దార్లకు కేటాయిస్తారు. దీని వల్ల సాధారణ పౌరులకు ప్రభుత్వం సేవలు వేగంగా లభిస్తాయి. ఒక వేళ ఆలస్యం జరిగితే రాష్ట్ర స్థాయి అధికారులకు త్వరగా సమాచారం అందేలా యాప్ రూపకల్పన యోచిస్తున్నారు. సంబంధిత తహసీల్దార్లు సర్టిఫికెట్ల జారీకి సంబంధించిన వివరణాత్మక డేటాను యాప్ ద్వారా అప్‌లోడ్ చేస్తారు. దీని నుంచి దరఖాస్తుదారులకు సేవలను అందించడంలో ఏదైనా జాప్యం గురించి రాష్ట్ర ప్రభుత్వం సమాచారాన్ని పొందవచ్చు అని మంత్రి సురేష్ కుమార్ పూజారి పేర్కొన్నారు. రాష్ట్రంలోని 45 మిలియన్లకు పైగా ప్రజలకు అన్ని ప్రభుత్వ సేవలను అందించేందుక ఏకీకృత వాట్సాప్ చాట్‌బాట్‌ను ప్రారంభించేందుకు మెటాతో ఒక అవగాహన ఒప్పందంపై సంతకాల తంతు ముగిసింది.

ఈ యూనిఫైడ్ వాట్సాప్ చాట్‌బాట్ 429 రకాల ప్రభుత్వ సేవలను ఒకే వాట్సాప్ నంబర్‌లో అనుసంధానిస్తుంది. ఈ చాట్‌బాట్ ద్వారా పౌరులు జనన, ఆదాయ ధృవీకరణ పత్రాలను పొందడం, డ్రైవింగ్, ఎరువుల లైసెన్స్‌ల కోసం దరఖాస్తు చేసుకోవడం, జాతీయ కుటుంబ ప్రయోజనాల పథకం వంటి ప్రోత్సాహకాలను పొందడం వంటి ముఖ్యమైన ప్రభుత్వ సేవలను ఒకే వాట్సాప్ నంబర్ ద్వారా పొందగలుగుతారు అని తెలిపారు.

స్థానిక లోక్ సేవా భవన్‌లో ప్రభుత్వ ప్రముఖ కార్యదర్శి మనోజ్ ఆహుజా, అభివృద్ధి కమిషనర్ కమ్ అదనపు ప్రధాన కార్యదర్శి అనూ గర్గ్, సాధారణ పాలన, ప్రజాభియోగాల విభాగం అదనపు ప్రధాన కార్యదర్శి సురేంద్ర కుమార్, గోపబంధు అకాడమీ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ జనరల్ సురేంద్ర కుమార్, ఉన్నత విద్యా శాఖ కమిషనర్ కమ్ సెక్రటరీ అరవింద్ అగర్వాల్ మరియు మాజీ సమాచార కమిషనర్, సీవైఎస్‌డీ మెంటర్ జగదానంద సమక్షంలో ఈ అవగాహన ఒప్పందంపై సంతకాలు జరిగాయి.

జేకేపూర్‌లో వేంకటేశ్వరుని బ్రహ్మోత్సవాలు



విశేష అలంకరణలో స్వామివారు



కళ్యాణ వేంకటేశ్వరుని ఆలయం

రాయగడ: పారిశ్రామిక కేంద్రంగా గుర్తింపు పొందిన జేకేపూర్‌లోని శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామి మందిరం 49వ వార్షికోత్సవంతో పాటు స్వామి వారి బ్రహ్మోత్సవాలు శనివారం నుంచి అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ ప్రధాన అర్చకులు పొందూరు వెంకట ప్రదీప్ ఆచార్యులు, అంపోలు రంగనాథ ఆచార్యుల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరుగుతున్నాయి. శనివారం ఉదయం విశ్వక్సేన పూజ, హేవాచనం, పరిషత్, రుత్విక్ వరుణ, మంపపావాహనం, అంకురారోపణ, విశేష పూజలు, నీరాజన మంత్రపుష్పం, మంగళాశాసనం తదితర పూజా కార్యక్రమాలు జరిగాయి. ఈ నెల 13వ తేదీ వరకు ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తామని ఆలయ కమిటీ అధ్యక్షులు పట్నాన గౌరీశంకరరావు, సభ్యులు ఎ.గిరిజా భాస్కరరావు తెలిపారు. ఉత్సవాల సందర్భంగా ఆలయాన్ని సుందరంగా అలంకరించారు.

బాల్య వివాహాలకు అడ్డుకట్ట



లిల్లీని సత్కరిస్తున్న ఉన్నతాధికారులు

- ఆదర్శంగా నిలిచిన లిల్లీ

రాయగడ: బాల్య వివాహం చేసేందుకు తన 15వ ఏటే తల్లిదండ్రులు సన్నద్ధమయ్యారు. అందుకు వరుడిని కూడా సిద్ధం చేశారు. పెళ్లికి అన్ని సమకూర్చారు. అయితే అందుకు నసేమిరా అంది. తల్లిదండ్రుల ఆలోచనను మార్చేసింది. బాల్యవివాహాలు చేసుకోవడం చట్టరీత్యా నేరమని వివరించింది. అయినా అంగీకరించని తన తల్లిదండ్రుల వైఖరిని అడ్డుకుంది. చివరకు బాల్యవివాహాన్ని తిరస్కరించింది లిల్లి కొండగిరి. అక్కడితో తన పని పూర్తయ్యిందని ఊపిరిపీల్చుకోలేదు. తనలాగే పరిసర గ్రామాల్లో జరగుతున్న బాల్యవివాహాలను అడ్డుకుంది. వారికి నచ్చజెప్పింది. ఇలా సుమారు పది బాల్యవివాహాలను అడ్డుకున్న లిల్లీ అందరికీ ఆదర్శనీయురాలిగా మారింది. జిల్లాలోని రామనగుడ సమితి కొరడ గ్రామానికి చెందిన లిల్లిని అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా స్థానిక డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో శనివారం జరిగిన కార్యక్రమంలో జిల్లా యంత్రాంగం లిల్లీని ఘనంగా సత్కరించారు. చిన్న వయసులోనే బాల్యవివాహాలకు వ్యతిరేకంగా అడ్డుగోడగా నిలిచిన ఆమె అందరికీ ఆదర్శనీయులని జిల్లా అదనపు కలెక్టర్ నిహారి రంజన్ కుహారో ప్రశంసించారు. బాల్యవివాహాల నియంత్రణకు జిల్లా యంత్రాంగం చేపడుతున్న చైతన్య కార్యక్రమాలకు ఆమె వారధిగా నిలవడం శుభపరిణామమన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా జిల్లా యంత్రాంగం మహిళల మధ్య నిర్వహించిన వివిధ పోటీలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సామాజిక, సంక్షేమ శాఖ అధికారి మీనతీ దేవ్, సీడీపీవో మీనాక్షి తదితరులు పాల్గొన్నారు.

మహిళల భద్రతపై నిబద్ధత



అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో పాల్గొన్న బీజేపీ ప్రముఖులు

భువనేశ్వర్: భారతీయ జనతా పార్టీ మహిళల అభివృద్ధికి కట్టుబడి ఉందని, రాష్ట్ర కార్యాలయంలో జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో ఉప ముఖ్యమంత్రి ప్రభాతి పరిదా అన్నారు. ప్రభుత్వం ఏర్పడితే రాష్ట్రంలో సుభద్ర యోజన పథకాన్ని అమలు చేస్తామన్న హామీని నెరవేర్చిందన్నారు. కేవలం 8 నెలల్లో సుభద్ర యోజన కింద 1 కోటి మందికి పైగా లబ్ధిదారులకు 10 వేల కోట్ల రూపాయల ఆర్థిక సహాయం అందించారని తెలిపారు. ఈ పథకం కోసం ఐదేళ్లలో సమగ్రంగా రూ. 55,000 కోట్లు వెచ్చిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షురాలు డాక్టర్ ఐశ్వర్య బిస్వాల్ మాట్లాడుతూ మహిళల భద్రత, శ్రేయస్సు కోసం మోహన్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బీజేపీ మహిళా మోర్చా సభ్యులు అవయవ దానం చేసేందుకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చినట్లు తెలిపారు. అవయవ దానం ప్రాముఖ్యతను అర్థం చేసుకుని 2,000 మందికి పైగా మరణానంతరం అవయవదానం కోసం తమ పేర్లను నమోదు చేసుకోగా, మరణానంతరం నేత్ర దానం కోసం 1000 మందికి పైగా ప్రమాణం చేశారని ఆమె తెలిపారు. విశిష్ట సేవలందించిన 20 మందిని సత్కరించారు.

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం



అంతర్జాతీయ మహిళా దినోత్సవం పోటీలలో విజేత పాణిగండ విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న కలెక్టర్, ఎస్పీ



గజపతి స్టేడియంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవంను ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్ బిజయ కుమార్ దాస్



జానపద నృత్యం చేస్తున్న విద్యార్థినులు



సుభద్ర పథకం రెండవ విడత డబ్బులు విడుదల కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

పర్లాకిమిడి: మహిళలకు సుభద్ర పథకం ప్రభుత్వం అందజేయడంతో వారి ఆర్థిక, సామాజిక స్థితిగతులు మెరుగుపడతాయని, ప్రతి మహిళను లక్షాధిపతి చేయడమే ముఖ్యమంత్రి మోహన్ మఝి సర్కారు ఉద్దేశమని కలెక్టర్ బిజయ కుమార్ దాస్ అన్నారు. స్థానిక గజపతి స్టేడియంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సుభద్ర పథకం లబ్ధిదారులకు రెండో విడత రూ.5వేలు ప్రదానోత్సవం కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మఝి బరంపురంలో నిర్వహించిన కార్యక్రమాన్ని స్క్రీన్‌పై వీక్షించారు. కార్యక్రమానికి మహిళలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమంలో ఎస్పీ జితేంద్ర పండా, డీఆర్‌డీఏ ముఖ్య కార్యనిర్వాహణ అధికారి ఇన్‌చార్జి పృథ్వీరాజ్ మండల్, పురపాలక ఈఓ లక్ష్మణ్ ముర్ము, జిల్లా సంక్షేమ శాఖ అధికారి మనోరమా దేవి, డీసీఓ అర్చనా మంగరాజ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సంధర్బంగా జానపద నృత్యాలను విద్యార్థులు ప్రదర్శించారు. అలాగే ప్రగతి మహిళా సంఘటన్ ఆధ్వర్యంలో స్థానిక రాజావారి ప్యాలస్ యుటెక్ కంప్యూటర్స్ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో మహిళలకు, విద్యార్థులకు నిర్వహించిన రంగవల్లులు, పిండివంటలు, వక్తృత్వ పోటీలలో విజేతలకు ముఖ్యఅతిథి ఇతిశ్రీ మహాపాత్రో, మానసీ పండా, పాయల్ పాత్రోలు బహుమతి ప్రదానం చేశారు.

జయపురంలో..

జయపురం: అంతర్జాతీయ మహిళా దినోత్సవాలను పలు సంస్థలు, మహిళా సంఘాలు ఘనంగా జరుపుకున్నాయి. స్థానిక విక్రమదేవ్ విశ్వ విద్యాలయంలో జరిగిన కార్యక్రమానికి వర్సిటీ రిజిస్ట్రార్ మహేశ్వర నాయిక్ అధ్యక్షత వహించారు. విద్యా రంగానికి ఎనలేని సేవలు అందిచిన స్థానిక ప్రభుత్వ మహిళా కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ సుచిత్ర మిశ్రను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పోస్టు గ్రాడ్యుయేట్ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ ప్రశాంత కుమార్ పాత్రో, ఎగ్జామినేషన్ కంట్రోలర్, రంజన్ కుమార్ పాత్రో, కళాశాల డిపార్ట్‌మెంట్ కౌన్సిల్ డైరెక్టర్ మహేశ్వర దురియ, హ్యూమన్ రిసోర్స్ డవలప్‌మెంట్ కౌన్సిల్ డైరెక్టర్ డాక్టర్ దేవదత్త ఇండోరియ, ఫైనాన్స్ కంప్ట్రోలర్ సచిన్ కుమార్ నాయిక్, భగవత్ ప్రసాద్ సింగ్, శ్రీమతి సుకాంతి సోయ్ తదితరులు పాల్గొన్నారు. జయపురం సహకార సమితి తరఫున ర్యాలీ నిర్వహించారు. మున్సిపాలిటీ వారు స్థానిక టౌన్ హాలులో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా చైర్మన్ నరేంద్రకుమార్ మహంతి, వైస్ చైర్మన్ బి.సునీత తదితరులు పాల్గొన్నారు.



విక్రమ్ దేవ్ విశ్వవిద్యాలయంలో మహిళా దినోత్సవంలో రిజిస్ట్రార్ మహేశ్వర నాయిక్



వేదికపై ఎస్పీ స్వాతి, శుభ్ర, బబిలత తదితరులు

వినూత్న నిరసన

భువనేశ్వర్: అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని రాష్ట్ర మహిళా కాంగ్రెస్ విభిన్న రీతిలో నిరసన ప్రదర్శించింది. స్థానిక మాస్టర్ క్యాంటీన్ ప్రాంతంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకల్లో ఈ దృశ్యం తారసపడింది. మండల మహిళా కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు మీనాక్షి బాహినీపతి అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ శిబిరంలో మహిళా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, కార్మికులు నల్ల గుడ్డలు కట్టుకుని వినూత్న రీతిలో నిరసన ప్రదర్శించారు. రాష్ట్రంలో మహిళల దయనీయ పరిస్థితికి ప్రతీకగా ఈ ప్రదర్శన చేపట్టారు. డబుల్ ఇంజిన్ ప్రభుత్వంలో రాష్ట్ర మహిళలు అణచివేతకు లోనై నిర్లక్ష్యానికి గురవుతున్నారని ఓపీసీసీ చీఫ్ భక్త చరణ్ దాస్ అన్నారు. మహిళలకు రక్షణ, సాధికారత కల్పిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన బీజేపీ తర్వాత ఇప్పుడు మహిళలను మోసం చేస్తోందని ఆరోపించారు. నరేంద్ర – మోహన్ ప్రభుత్వ హయాంలో మహిళలపై అణచివేత హద్దులు దాటిందన్నారు.



విశ్వవిద్యాలయ మహిళా దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థినులు



సహకారసమితి నిర్వహించిన ర్యాలీ



కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

నీలకంఠపూర్ గూడలో..

పర్లాకిమిడి: గుమ్మా బ్లాక్ నీలకంఠపూర్ గూడలో ప్రగతి మహిళా సంఘటన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ప్రముఖ కేంద్ర వామపక్షనేత బాలచంద్ర షడంగి హాజరయ్యారు. మహిళలపై ఈనాటికీ హింస జరుగుతోందన్నారు. కేంద్ర బడ్జెట్‌లో మహిళలకు కేటాయింపులు తక్కువ జరుగుతున్నాయని, రాష్ట్ర బడ్జెట్‌లో ఏడాదికి పదివేల రూపాయల సుభద్ర పథకం కూడా అతి తక్కువ అని బాలచంద్ర షడంగి అన్నారు.

ప్రాంతీయ సహకార సంఘం ఆధ్వర్యంలో..

పర్లాకిమిడి: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వాకథాన్ 2025ను స్థానిక గజపతి ప్యాలెస్ నుంచి జిల్లా కోపరేటివ్ సొసైటీస్ అధికారి హరిహర శెఠి ప్రారంభించారు. మహిళలు అన్ని రంగాల్లో సాధికారత, ఆర్థిక స్వావలంబన సాధించాలని ఆయన కోరారు. సమావేశంలో సబ్ కలెక్టర్ అనుప్ పండా, మహిళా కో ఆపరేటివ్ సొసైటీస్ అధ్యక్షురాలు ఎ.పద్మాయరాజ్, రైతు సంఘం నాయకులు సూర్యనారాయణ పట్నాయిక్ తదితరులు పాల్గొన్నారు.



టౌన్ హాలులో మాట్లాడుతున్న చైర్మన్ మహంతి



చిన్నారుల నృత్యాలు



నల్ల గుడ్డలు కట్టుకుని మహిళా దినోత్సవం జరుపుకున్న రాష్ట్ర మహిళా కాంగ్రెసు కార్యకర్తలు

అన్ని రంగాల్లో రాణించాలి

రాయగడ: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఎస్పీ స్వాతి ఎస్.కుమార్ అన్నారు. స్థానిక మున్సిపాలిటీ టౌన్ హాల్‌లో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మున్సిపాలిటీ యంత్రాంగం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ వైస్ చైర్మన్ శుభ్ర పండ, రాయగడ కళాశాల ప్రిన్సిపాల్ బబిలత షరఫ్ తదితరులు పాల్గొన్నారు.



మహిళా దినోత్సవంలో మాట్లాడుతున్న కేంద్ర వామపక్ష నాయకులు బాలచంద్ర షడంగి



అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రాంతీయ సహకార సంఘాల వాకథాన్

క్లుప్తంగా

నేరాల నియంత్రణ అందరి బాధ్యత



మాట్లాడుతున్న పట్టణ పోలీస్ అధికారి ఈశ్వర తండి

జయపురం: జయపురంలో నేరాలు పెరగటంపై పట్టణ ప్రముఖులు, పలు సంస్థల ప్రతినిధుల ఫిర్యాదుపై చర్యలు చేపట్టాలని పోలీస్ డీజీని ముఖ్యమంత్రి మోహణ మఝి ఆదేశించినట్లు వార్తలు వచ్చాయి. ఈ నేపథ్యంలో జయపురం పట్టణంలో నేరాలు నివారించేందుకు పట్టణ పోలీసు అధికారి ఈశ్వర చంద్ర తండి నడుం బిగించారు. గతకొద్ది నెలలుగా పట్టణంలో దొంగతనాలు, చైన్ స్నేకర్స్, దోపిడీలు, కిడ్నాప్‌లు, నేరాలు ఎక్కవయ్యాయి. పట్టణాన్ని అపరాధ ముక్త పట్టణంగా మార్చాలని, పట్టణంలో శాంతిని పునరుద్ధరించాలని కొత్తగా పట్టణ పోలీస్ అధికారిగా బాధ్యతలు చేపట్టిన ఈశ్వర చంద్ర తండి శుక్రవారం సాయంత్రం మున్సిపాలిటీ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్ల, పలు సంస్థల ప్రతినిధులతో సమావేశమయ్యారు. జయపురం పట్టణంలో అకస్మాత్తుగా నేరాలు పెరగటానికి గల కారణాలపై ఆయన సభికులతో చర్చించారు. సరస్వతీ పూజల సందర్భంగా మూర్తి నిమరజన చేసి వస్తున్న విక్రమదేవ్ విశ్వవిద్యాలయ విద్యార్థిపై కత్తితో పొడిచిన సంఘటన, హట పోదర్‌లో ఒక షోరూంలో దొంగతనం, లింగరాజ్‌నగర్‌లో ఒక ఇంటిలో40 తులాల బంగారం, రూ.30 వేల దొంగతనం, ధన్‌పూర్ శాఖ కెనాల్ ప్రాంతంలో దొంగతనం, ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంతోపాటు పలు ప్రాంతాల్లో అసాంఘిక వ్యక్తులకు అడ్డాలుగా ఉన్న విషయం, పట్టణంలో అపరిచితుల సంఖ్య పెరగటం, తదితర సంఘటనలపై చర్చించారు. బయట వారు ఎక్కడ నుంచి వచ్చి అద్దె ఇళ్లలో ఉంటున్నారో వారి జాబితా తయారు చేయాలని పోలీసు అధికారి కౌన్సిలర్లకు సూచించారు. అనుమానితులపై పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఇళ్లకు తాళాలు వేసి బయటకు వెళ్లేవారు ఆ విషయం పోలీసులకు తెలపాలన్నారు. మున్సిపల్ చైర్మన్ నరేంద్ర కుమార్ మహంతి, వైస్ చైర్‌పర్సన్ బి.సునీత, కౌన్సిలర్లు, ప్రైవేట్ బస్సు యజమానుల సంఘం, ట్రక్కు మాలిక్ సంఘం ప్రతినిధిలు, సమాజ సేవా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో ఒక్కటైన దంపతులు



ఎనిమిదేళ్లు దూరంగా ఉన్న దంపతులు ఒక్కటైన వేళ..

జయపురం: కొరాపుట్ జిల్లా న్యాయసేవా ప్రదీకరణ జయపురం వారు అంతర్ జాతీయ మహిళా దినోత్సవంతో పాటు లోక్ అదాలత్‌ను శనివారం నిర్వహించారు. స్థానిక ఇల్లా కోర్టు ప్రాంగణంలో నిర్వహించిన ఆదాలత్‌లో వివిధ కోర్టుల్లో ఉన్న సివిల్, క్రిమినల్, మోటారు ప్రమాదాల కేసులు, రెవెన్యూ, భూ వివాదాలు, కుటుంబు సమస్యలు, వివాహ సంబంధిత కేసులను పరిష్కరించారు. మహిళా దినోత్సవం సందర్భంగా లోక్ అదాలత్‌లో భార్యా భర్తల మధ్య వివాదాన్ని పరిష్కరించారు. భర్తకు 60 ఏళ్లు, భార్యకు 50 ఏళ్లు, వారికి ఒక కుమార్తె. ఇరువురు విద్యావంతులు. బాధ్యతాయుతమైన ప్రభుత్వ ఉద్యోగులు. అయితే కుటుంబ కలహాలతో ఎనిమిదేళ్లుగా వేర్వేరుగా ఉంటున్నారు. లోక్ అదాలత్‌లో ఇద్దరితో చర్చించి సమస్యను పరిష్కరించి వారిని ఒకటి చేశారు. దంపతులు ఒకరికొకరు మిఠాయి తినిపించుకున్నారు. కాగా అదాలత్‌లో 6947 పెండింగ్ కేసులలో 6289 పరిష్కరించారు. మూడు కోట్ల 74 లక్షల రూాయలను జరిమానాగా వసూలు చేశారు. కేటగిరీస్ కేసులలో 2865 కేసులు టేకప్ చేసి వాటిలో 415 పరిష్కరించి 15 కోట్ల 10 లక్షల 88 వేల 87 రూపాయలతో కేసులు షటిల్ చేశారు. అదాలత్‌ను జిల్లా జడ్జి, జిల్లా న్యాయ సేవా ప్రదీకరణ అధ్యక్షులు పీప్ కుమార్ మహంత ప్రారంభించారు. అదనపు జిల్లా జడ్జి సంఘమిత్ర దాస్, మహిళా న్యాయ విభాగ విచారపతి అలకనంద మహంతి, న్యాయ సేవా ప్రదీకరణ కార్యదర్శి, లోక్‌అదాలత్ శాశ్వత విచారపతి సుమన్ జెన, రిజిస్ట్రార్ బిస్తుపసాద్ దేవత, జయపురం సబ్ డివిజనల్ జడ్జి సంతోష్ కుమార్ దాస్, ప్రథమ శ్రేణి విభాగ విచారణపతి అనిమేస్ జెన పాల్గొన్నారు. కొరాపుట్, కొట్‌పాడ్, లక్ష్మీపూర్, సెమిలిగుడ, దసమంతపూర్, బొరిగుమ్మ, లమతాపుట్ కోర్టులలో కూడా లోక్ అదాలత్ నిర్వహించి పలు కేసులు పరిష్కరించినట్లు అధికారులు వెల్లడించారు.



లోక్‌అదాలత్‌లో కేసులు పరిష్కరిస్తున్న జిల్లా జడ్జి

రూ. 27తో గడిచేది ఎలా..?



శంఖ భవన్‌లో ఏర్పాటు చేసిన మహిళా దినోత్సవ వేదికపై నవీన్ పట్నాయక్ ప్రసంగం.

భువనేశ్వర్: రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ ప్రభుత్వ పాలనలో మహిళ సాధికారిత అగమ్య గోచరంగా పరిణమించిందని, మహిళ సాధికారిత హామీతో గద్దెనెక్కిన బీజేపీ ప్రభుత్వం మొక్కుబడి వైఖరితో మహిళల్ని దిగజార్చుతోందని బిజూ జనతా దళ్ నాయకుడు నవీన్ పట్నాయక్ ఆరోపించారు. అంతర్జాతీయ మహిళా దినం పురస్కరించుకుని స్థానిక శంఖ భవన్ సముదాయంలో శనివారం ఏర్పాటు చేసిన ప్రత్యేక సభా కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు.

మహిళల సాధికారిత కోసం నడుం బిగించి చారిత్రాత్మక సంస్కరణల్ని ఆవిష్కరించిన దివంగత నాయకుడు బిజూ పట్నాయక్‌ని ఈ ప్రభుత్వం అవమాన పరిచిందని తెలిపారు. 1990 దశకంలో పంచాయతీ రాజ్ సంస్థల్లో మహిళలకు ప్రత్యేక ప్రాతినిధ్యానికి బిజూ పట్నాయక్ తొలి బీజం నాటారని గుర్తు చేశారు. పంచాయితీ సంస్థలు, ప్రభుత్వ ఉద్యోగాల్లో మహిళలకు మూడో వంతు 33 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు చట్టాన్ని తీసుకొచ్చారని నవీన్ పట్నాయక్ గుర్తు చేశారు. ఆయన అనన్య సేవలకు గుర్తుగా ఏటా బిజూ జయంతి పురస్కరించుకుని పంచాయతీ రాజ్ దివస్ జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఈ దీర్ఘకాల ఆనవాయితీని మార్చి బిజూ బాబును ప్రభుత్వం అవమానపరిచిందని ఆందోళన వ్యక్తం చేశారు.

మహిళల సాధికారత కోసం కొత్త సర్కారు సుభద్ర యోజన ప్రవేశ పెట్టిందని, ఎన్నికల హామీ మేరకు వాస్తవ కార్యాచరణకు వచ్చే సరికి ఈ పథకం పలు మలుపులు తిరుగుతుందన్నారు. ప్రతి మలుపులో మహిళకు అన్యాయమే జరుగుతుందని, ఎన్నికల ప్రచారంలో ప్రకటించిన ప్రకారం సుభద్ర యోజన అమలు నోచుకోలేదని తెలిపారు. ఈ పథకం కింద రాష్ట్రంలో మహిళకు రోజుకు రూ. 27 మాత్రమే ముడుతున్నాయని, ఈ చిరు మొత్తంతో మహిళ సాధికారిత ఎలా సాధ్యమని నవీన్ పట్నాయక్ నిలదీశారు.

నగరంపల్లి వీధిలో అనుమానాస్పద మృతి



నగరంపల్లి వీధి వద్ద మృతుని ఇంటి వద్ద పోలీసులు, విలేకరులు



మృతుడు జగదీష్ మెలక, భార్య



విలేకరులతో మాట్లాడుతున్న మృతుని తల్లి



మాట్లాడుతున్న జగదీష్ తండ్రి

పర్లాకిమిడి: స్థానిక నటరాజ్ సినిమా థియేటర్ సమీపంలో నగరంపల్లి వీధి మెయిన్ రోడ్డులో ఒక అద్దె ఇంటిలో ఉంటున్న మెలక జగదీష్ (26) మృతదేహాన్ని స్థానికులు కనుగొన్నారు. ఇంటి నుంచి దుర్గంధం వస్తుండడంతో ఇంటి యజమాని చిన్మయి గౌడో పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు వచ్చి చూడగా ఇంటిలో ఫస్టుఫ్లోర్‌లోని బెడ్ రూంలో చనిపోయి పడి ఉండటాన్ని ఆదర్శ పోలీసు స్టేషన్ అధికారి ప్రశాంత భూపతి కనుగొన్నారు. గుణుపురంలో డ్రైవరుగా పనిచేస్తున్న మెలక జగదీష్ ఆరునెలల కిందట ఒక క్రిష్టియన్ అమ్మాయిని పెళ్లి చేసుకున్నాడు. ఆ అమ్మాయికి పర్లాకిమిడి మెడికల్‌లో ఉద్యోగం వచ్చిందని చెప్పి నగరంపల్లి వీధిలో ఒక ఇంటిని అద్దెకు తీసుకున్నారు. వారం రోజుల కిందట డ్రైవరు జగదీష్ పర్లాకిమిడి వచ్చి ఇక్కడ ఉంటున్నాడని ఇరుగు పొరుగు వారు చెబుతున్నారు. ఈ సంఘటన అనంతరం శనివారం మధ్యాహ్నం గుణుపురం నుంచి మృతుడి తల్లిదండ్రులు, బంధువులు పర్లాకిమిడి చేరుకున్నారు. తన కొడుకుని ప్రియురాలే హత్య చేసి ఉంటుందని ఆరోపించారు. జగదీష్ మృతి తర్వాత ఆమె పరారు కావడం గమనార్హం. మృతదేహాన్ని మెడికల్‌కు తరలించారు. పోలీసు స్టేషన్ నుంచి సైంటిఫిక్ బృందం విచ్చేసి మృతుని గదిలో శాంపిల్స్ సేకరించారు. దీనిపై ఆదర్శ పోలీస్ స్టేషన్‌లో ఒక యూడీ కేసు రిజిస్టర్ చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఐఐసి ప్రశాంత్ భూపతి తెలియజేశారు.

రాజీయే రాజమార్గం



లోక్ అదాలత్‌లో కేసులను విచారిస్తున్న జిల్లా జడ్జి ప్రణబ్ కుమార్ రౌత్రాయ్

పర్లాకిమిడి: స్థానిక జిల్లా కోర్టు ప్రాంగణంలో శనివారం ద్వితీయ రాష్ట్రీయ లోక్ అదాలత్‌ను జిల్లా జడ్జి, జిల్లా న్యాయ సేవా ప్రాధికరణ అధ్యక్షుడు ప్రణబ్ కుమార్ రౌత్రాయ్ పర్యవేక్షించారు. జిల్లా కోర్టులో మొత్తం కేసులు 4665 విచారణలో ఉండగా, వాటిలో 3690 కేసులు పరిష్కరించారు. జరిమానాల రూపంలో రూ.43 లక్షల 10 వేల 121 సేకరించారు. జిల్లాలో జాతీయ బ్యాంకుల్లో వివిధ కేసులు 866 ఉండగా, 33 కేసులు మాత్రమే పరిష్కరించినట్లు కోర్టు అధికారులు తెలిపారు. ఫ్యామిలీ కోర్టులో అశోక్ కుమార్ పహి, ఆదనపు జిల్లా జడ్జి ప్రదీప్ కుమార్ సామల్, ముఖ్య విభాగాల విచారణ అధికారి నరోత్తమ శెఠి, సివిల్ కోర్టు రిజిస్ట్రార్ ప్రసన్న కుమార్ బెహరా, లీగల్ సర్వీసెస్ కార్యదర్శి బిమల్ రౌళో, మహిళా కోర్టు విచారణ అధికారి రస్మితా సాహు, ఎస్.డి.జె.ఎం.విష్ణుప్రియా సామంతరాయ్, తదితరులు పాల్గొన్నారు. ఆర్.ఉదయగిరి, మోహానా, కాశీనగర్ కోర్టుల్లోనూ కేసులు పరిష్కరించారు.



ఎస్‌బీఐ బ్యాంక్‌లో లోక్ అదాలత్

రహదారిపై అమ్మవారికి పూజ చేసేందుకు ముర్రాటలతో మహిళాలు



దేవతల ఆగమనం

మల్కన్‌గిరి: జిల్లాలో శనివారం నుంచి బోడ జాతర ప్రారంభమైంది. జిల్లా కేంద్రంలో నాలుగు రోజులు జరిగే ఈ జాతరలో తొలిరోజు కన్యమారిు వీధి వద్దకు చేరుకున్నారు. మా ముత్యాలమ్మతో కన్నంరాజ్(శ్రీకృష్ణుడు), బాల్‌రాజ్(అర్జునుడు), పోతురాజ్(భీముడు), నెమలి పింఛాలతో భక్తులకు దర్శనమిస్తున్నారు.



మల్కన్‌గిరి కన్యమారిు మండపం వద్ద పూజలు అందుకుంటూన్న దేవతా మూర్తులు



ఊరేగింపులో ఘటాలు



కన్యమారిు వద్దకు ఊరేగింపుగా వస్తున్న దృశ్యం

భువనేశ్వర్ కొత్త రైల్వేస్టేషన్‌లో సేవల ప్రారంభం

- అమృత్ భారత్ పథకం కింద అభివృద్ధి

భువనేశ్వర్: తూర్పు కోస్తా రైల్వే ప్రధాన కార్యాలయం స్టేషన్ భువనేశ్వర్ పరిసర ప్రాంతాల నగరవాసులకు రైలు సేవల్ని విస్తరిస్తున్నారు. స్థానిక లోక్ సభ సభ్యురాలు అపరాజిత షడంగి రైల్వే శాఖ సంప్రదింపులతో ఈ సౌకర్యాలు అందుబాటులోకి రానున్నట్లు తెలిపారు. ఉత్తర భువనేశ్వర్, సమీప ప్రాంతాల నివాసితులకు రైలు రవాణా అనుసంధానం గణనీయంగా మెరుగుపరిచేందుకు రైల్వే శాఖతో ఈ మేరకు సంప్రదింపులు చేసినట్లు ఆమె పేర్కొన్నారు. సంప్రదింపులు ఫలప్రదం కావడంతో భువనేశ్వర్ న్యూ రైల్వే స్టేషన్ (బీబీఎస్ఎన్) నుంచి 3 ప్రధాన ఎక్స్‌ప్రెస్ రైళ్లు త్వరలో బయల్దేరనున్నాయి. ఈ రైళ్లు మంచేశ్వర్ స్టేషన్‌లో కూడా ఆగుతాయి. ఈ జాబితాలో భువనేశ్వర్, ముంబై మధ్య నడిచే 11019, 11020 నంబర్ల కోణార్క్ ఎక్స్‌ప్రెస్, భువనేశ్వర్, సికింద్రాబాద్ మధ్య నడిచే 17015, 17016 నంబర్ల విశాఖ ఎక్స్‌ప్రెస్, భువనేశ్వర్, విశాఖపట్నం మధ్య నడిచే 22819, 22820 నంబర్ల ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఉన్నాయి. త్వరలో ఈ సేవలు ఆరంభం కానున్నాయి. ఈ మేరకు అధికారిక ఉత్తర్వులు వెలువడుతాయి.

భువనేశ్వర్ న్యూ రైల్వే స్టేషను సమీపం ఉత్తర భువనేశ్వర్ ప్రాంతంలో అత్యధిక ఇంజినీరింగ్, వైద్య కళాశాలలు ఇతరేతర విద్యా సంస్థలు, వైద్య, ఆరోగ్య సంస్థలు పని చేస్తున్నాయి. రైల్వే శాఖ తాజా నిర్ణయం అత్యధిక విద్యార్థులు, ఇతర వర్గాలకు ఉపకరిస్తుంది.



భువనేశ్వర్ న్యూ రైల్వే స్టేషన్

అమృత్ భారత్ పథకం కింద పునరాభివృద్ధి

అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద భువనేశ్వర్ న్యూ రైల్వే స్టేషను నిర్మాణం పనులు చకచకా సాగుతున్నాయి. మెరుగైన విద్యుద్దీప కాంతులతో విస్తృత పార్కింగు, సర్క్యులేటింగు ప్రాంతంతో అన్ని ప్లాట్‌ఫామ్‌లపై ఆధునిక విశ్రాంతి, నిరీక్షణ గదులు, లిఫ్టుల సౌకార్యలు అందుబాటులోకి వస్తాయి.

సందడిగా సుభద్రాయోజన కార్యక్రమం



వేదికపై అతిథులు

- తరలివచ్చిన మహిళలు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా యంత్రాగం ఆధ్వర్యంలో మాల్యవంత్ హాస్టల్ ప్రాంగణంలో శనివారం సుభద్రా యోజన రెండో విడత మంజూరు కార్యక్రమాన్ని నిర్వహించారు. బరంపురంలో ఈ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి ప్రారంచగా.. అదే సమయంలో మల్కన్‌గిరిలో స్థానిక ఎమ్మెల్యే నర్సింగ్ మడ్కమి ప్రారంభించారు. ఈ పథకం కోసం ఇప్పటికే 1,49,153 మంది మహిళలు తమ పేర్లను నమోదు చేసుకున్నారు. అందులో 1,34,610 మందికి ఆర్థికసాయం చేశారు. మహిళా దినోత్సవం సందర్భంగా రెండో విడత నిధులు విడుదల చేసినట్టు ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తెలిపారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆశీష్ ఈశ్వర్ పటేల్, జిల్లా అదనపు కలెక్టర్ వేద్బర్ ప్రదన్, జిల్లా సబ్ కలెక్టర్ దుర్యోధన్ బోయి పాల్గొన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. రెండు వేలమందికి పైగా అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



పాల్గొన్న మహిళలు

25 యూనిట్ల రక్తం సేకరణ

జయపురం: జయపురం సబ్‌డివిజన్ కుంద్ర గ్రామంలో శనివారం స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 25 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. కుంద్ర కమ్యూనిటీ ఆస్పత్రి, ఒడియా సంస్థలు సంయుక్తంగా నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని వైద్యాధికారి డాక్టర్ గణేష్ ప్రసాద్ దాస్ ప్రారంభించారు. కొరాపుట్ జిల్లా రక్త దాతల మోటివేటెడ్ అసోసియేషన్ సభ్యులు, కొట్‌పాడ్ ఎమ్మెల్యే ప్రతినిధి బద్రి నారాయణ ఆచార్య ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. గౌరవ అతిథిగా సమాజ సేవకుడు పద్మనాభ బిశాయి, భగవాన్ పండ, తుషార్ భట్, ఉపేంద్ర భట్, ధనపతి పొరజ, దయాధాన హరిజన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ గణేష్ ప్రసాద్ దాస్ మాట్లాడుతూ.. రక్తదాన శిబిరాల నిర్వహణ తగ్గడంతో అత్యవసర సమయంలో రక్తం లభ్యంకాని పరిస్థితి ఉందన్నారు. బ్లడ్‌బ్యాంకుల్లో నిల్వలు తగ్గుతున్నాయన్నారు. భవిష్యత్తులో సమితిలోని ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల సహకారంతో ప్రతి గ్రామ పంచాయతీలో రక్తదాన శిబిరాలు నిర్వహిస్తామన్నారు. అర్హులంతా రక్తదానం చేసి కొరతను అరికట్టాలని విజ్ఞప్తి చేశారు. కుంద్రా సమితిలో విరివిగా రక్తదాన శిబిరాలు నిర్వహించేందుకు జిల్లా రక్తదాతల మోటివేటెడ్ అసోసియేషన్ సహకరిస్తోందని సభ్యుడు భద్రినారాయణ ఆచారి హామీ ఇచ్చారు. జయపురం బ్లడ్‌బ్యాంక్ టెక్నీషియన్లు శుభశ్రీ మిశ్ర, బులు గౌడ, అజయ పండ దాతల నుంచి రక్తాన్ని సేకరించారు. కుంద్ర ఆస్పత్రి బి.ఎ.ఎం.తాజల్ తరాశియ, ఫార్మాసిస్టు త్రినాథ్ సాహు, విఘ్నేశ్వర పండ, సంగ్రామ కేశరి లెంక, సంబాద్ కుంద్ర బ్లాక్ ప్రతినిధి అక్షయ పట్నాయక్, సదాశివ నాయిక్, గంగాధర నాయిక్, కున హరిజన్ శిబిరాన్ని పర్యవేక్షించారు. రక్త దాతలకు ప్రశంసా పత్రాలను అందజేసి సత్కరించారు.



రక్తదాతలకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న అతిథులు



రక్తదానం చేస్తున్న దాతలు

ముగిసిన నామినేషన్ల పర్వం



అధ్యక్ష పదవికి నామినేషన్ అందజేస్తున్న మణి పట్నాయక్

జయపురం: ఈ నెల 27 వ తేదీన జరుగనున్న జిల్లా బార్ అసోసియేషన్ ఎన్నికల నామినేషన్ పర్వం ముగిసింది. మొత్తం 27 నామినేషన్‌లు దాఖలైనట్లు ఎన్నికల అధికారి దాసరథి పట్నాయక్ శనివారం వెల్లడించారు. జిల్లా బార్ అధ్యక్ష పదవికి ఐదు, ఉపాధ్యక్ష పదవికి 2 నామినేషన్‌లు దాఖలయ్యాయి. కార్యదర్శి పదవికి 3, సహాయ కార్యదర్శి పదివికి ఒకటి, సహాయ కార్యదర్శి (మహిళ)పదవికి ఒకటి, కోశాధిపతి పదవికి 2, గ్రంథాలయ కార్యదర్శి పదవికి 2, గ్రంథాలయ సహాయ కార్యదర్శి(మహిళ) పదవికి ఒకటి, కోశాధ్యక్ష పదవికి 2 నామినేషన్‌లు వచ్చాయి. కార్యవర్గ సభ్యుల పదవులకు 10 నామినేషన్‌లు దాఖలయ్యాయి. ఎన్నికల అధికారికి సహాయ ఎన్నికల అధికారులుగా జ్యోతి రంజన్ పూజారి, ఎస్.ఎస్.సుందరమ్ సహకరించారు. 9వ తేదీన నామినేషన్‌ల పరిశీలన జరుగుతుందని, 12న నామినేషన్‌ల ఉపసంహారణ కార్యక్రమం ఉంటుందని వెల్లడించారు. 12న బరిలో ఉన్న అభ్యర్థుల జాబితా విడుదల చేస్తారు. మార్చి 29వ తేదీన పోలింగ్ జరుగుతుంది. ఉదయం 9 నుంచి 3 గంటల వరకు పోలింగ్ ఉంటుందని, సాయంత్రం 4 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుందని ఎన్నికల అధికారి దాసరథి పట్నాయక్ వెల్లడించారు.

7 నామినేషన్‌లు

జయపురం: జయపురం సబ్ డివిజన్ కొట్‌పాడ్ బార్ అసోసియేషన్ ఎన్నికల ప్రక్రియలో నామినేషన్‌ల పర్వం పూర్తయింది. వివిధ పదవుల కోసం 7 నామినేషన్‌లు దాఖలయ్యాయని ఎన్నికల అధికారి, సీనియర్ న్యాయవాది జితేంద్రనాథ్ మహాపాత్రో శనివారం వెల్లడించారు. బార్ అధ్యక్ష పదవికి ప్రముఖ న్యాయవాది మణిప్రసాద్ పట్నాయక్, పంకజ కుమార్ పాత్రో, అజిత్ కుమార్ పట్నాయక్‌లు నామినేషన్‌లు దాఖలు చేశారని వెల్లడించారు. కార్యదర్శి పదవికి యువ న్యాయవాది ముక్తేశ్వర నాయక్(బాబులి), జ్ఞానేంద్ర నాయక్ నామినేషన్‌లు వేశారు. ఉపాధ్యక్ష పదవికి సుధీర్ చంద్రనాయక్ నామినేషన్ వేయగా, సహాయ కార్యదర్శి పదవికి ఎ.చంద్రరావు నామినేషన్ దాఖలు చేశారు. ఈ నెల 29వ తేదీన ఎన్నికలు జరుగుతాయని ఎన్నికల అధికారి వెల్లడించారు.



జాబితా ప్రకటిస్తున్న ఎన్నికల అధికారి దాసరథి పట్నాయక్



నామినేషన్‌లు దాఖలు చేస్తున్న అభ్యర్థులు

భారీగా గంజాయి స్వాధీనం

రాయగడ: జిల్లాలోని పద్మపూర్ పోలీస్ స్టేషన్ పరిధి శారదాపూర్ గ్రామ శివారులోని జీడితోట వద్ద గంజాయి అక్రమ రవాణా జరుగుతుందన్న సమాచారం తెలుసుకున్న పోలీసులు శనివారం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా 345 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్న పోలీసులు ఒకరిని అరెస్టు చేసి కోర్టుకు తరలించారు.



గంజాయితో పట్టుబడిన నిందితుడు

చెరువులో మొసలి

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కోరుకొండ సమితి మారివాడ పంచాయితీ ఎంవీ-26 గ్రామం చెరువులో శుక్రవారం నుంచి మొసలి సంచరిస్తోంది. దీంతో స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. విషయాన్ని జిల్లా అటవీశాఖ సిబ్బందికి తెలియజేశారు. దీంతో శనివారం ఉదయం అటవీ సిబ్బంది వచ్చి మొసలిని బంధించేందుకు ప్రయత్నించారు. అయితే నీటి ప్రవాహం ఎక్కువగా ఉండడం, చీకటి పడడంతో ప్రయత్నాన్ని విరమించారు. ఆదివారం మరోసారి ప్రయత్నం చేస్తామని అటవీ అధికారి రమేశ్ రావత్, ఫారెస్ట్ గార్డు జ్యోతి దుమ్ దుమ్, ఫారెస్టు రేంజర్ వసంతి మడ్కమి తెలిపారు.



చెరువులో సంచరిస్తున్న మొసలి

క్లుప్తంగా

గడ్డి ట్రాక్టర్‌ను ఢీకొన్న గుర్తు తెలియని లారీ



రోడ్డుపై బోల్తాపడిన గడ్డి ట్రాక్టర్

కొత్తవలస : మండలంలోని అరకు – విశాఖ జాతీయ రహదారిలో నిమ్మలపాలెం జంక్షన్ సమీపంలో గల సూర్య ఐటీఐ వద్ద ముందు వెళ్తున్న గడ్డి ట్రాక్టర్‌ను వెనుక నుంచి గుర్తు తెలియని లారీ శనివారం ఢీకొట్టింది. ఎల్.కోట మండలం కళ్లేపల్లి నుంచి వరి గడ్డితో ట్రాక్టర్‌పై నుంచి కొత్తవలస వెళ్తుండగా వెనుక నుంచి అతి వేగంగా గుర్తు తెలియని లారీ వచ్చి ఢీకొట్టింది. దీంతో గడ్డి లోడుతో ఉన్న ట్రాక్టర్ బోల్తా పడింది. ట్రాక్టర్ డ్రైవర్ తెరుకునే లోపే లారీ అతివేగంగా తప్పించుకుపోయింది. ఈ ప్రమాదంలో ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. జేసీబీ సాయంతో గడ్డి ట్రాక్టర్‌ను రోడ్డు సేఫ్టీ పోలీస్‌లు దగ్గరుండి పక్కకు తొలిగించారు.

గడ్డి ట్రాక్టర్ దగ్ధం



మంటలను అదుపు చేస్తున్న అగ్ని మాపక సిబ్బంది

గజపతినగరం రూరల్: మండలంలోని గంగచోళ్లపెంట గ్రామంలో శనివారం జరిగిన అగ్ని ప్రమాదంలో విద్యుత్ వైర్లుకు గడ్డి ట్రాక్టరు తగలడంతో దగ్ధమైంది. సంఘటనకు సంబంధించి పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కనకల సూర్యనారాయణకు చెందిన ట్రాక్టరులో ఎండు గడ్డిని ఎక్కించి తీసుకువెళ్తుండగా మార్గ మధ్యలో ఉన్న విద్యుత్ వైర్లు తగలడంతో షార్ట్ సర్క్యూట్ జరిగి మంటలు వ్యాపించి గడ్డితో పాటు ట్రాక్టరు పూర్తిగా కాలిపోయింది. ప్రమాద సంఘటన విషయాన్ని గజపతినగరం అగ్ని మాపక కేంద్రానికి సమాచారం ఇవ్వడంతో అగ్ని మాపక సిబ్బంది వాహనంతో వచ్చి మంటలను అదుపు చేశారు. అప్పటికే ట్రాక్టరు పూర్తిగా కాలి పోయింది.

కుల దూషణపై అట్రాసిటీ కేసు

బొండపల్లి: మండలంలోని కొత్తపాలెం సచివాలయం వెల్ఫేర్ సహాయకుడుగా పని చేస్తున్న ఉద్యోగిపై కుల దూషణ చేసినట్లు ఉద్యోగి ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు నిర్వహించి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ యు.మహేష్ తెలిపారు. ఈ నెల 1న సామాజిక భద్రత పింఛన్లను పంపిణీ చేసేందుకు యడ్లపాలెం గ్రామానికి చెందిన వెల్ఫేర్ సహాయకుడు గొర్లె సతీష్‌కుమార్ వెళ్లాడు. మజ్జి అప్పయ్యమ్మ ఇంటికి పింఛన్ ఇచ్చేందుకు వెళ్లగా సెల్ సిగ్నల్స్ పని చేయకపోవడంతో పక్క ఇంటికి వెళ్లి పింఛన్ అందించడానికి వెళ్లాడు. ఈ క్రమంలో మా అమ్మకు పింఛన్ ఇవ్వకుండా పక్క ఇంటికి ఎందుకెళ్లావు? అని అప్పయ్యమ్మ కుమారుడు బంగారునాయుడు కులం పేరిట దూషించినట్లు పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. ఈ మేరకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ డీఎస్పీ వీరాకుమార్ దర్యాప్తు నిర్వహించి కేసు నమోదు చేశారు.

మిస్సింగ్ కేసు నమోదు



సత్తిరాజు (ఫైల్)

పార్వతీపురం రూరల్: పార్వతీపురం పట్టణంలో గల ఎస్ఎన్‌పీ కాలనీకి చెందిన జె.సత్తిరాజు ఈ నెల 5వ తేదీన ఉదయం 6గంటలకు తన రోజువారీ పనుల నిమిత్తం బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాకపోవడంతో భార్య సౌజన్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు అదృశ్యం కేసు నమోదు చేసినట్టు పట్టణ ఎస్ఐ గోవిందరావు శనివారం తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చెప్పారు.

వధూవరులను ఆశీర్వదించిన జెడ్పీ చైర్మన్



నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, తదితరులు

విజయనగరం టౌన్/ గంటస్తంభం : విజయసాగర దుర్గా మల్లేశ్వరి అమ్మవారి ఆలయంలలో హెల్పింగ్ హ్యాండ్స్ హిజ్రాస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విభిన్న ప్రతిభావంతులైన శ్రీసత్య – సత్యనారాయణరావు, విజయలక్ష్మి – వెంకటసత్య ఆచారి జంటలకు శనివారం వివాహం జరిపించారు. ఈ వివాహ వేడుకలకు జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ, మజ్జి సరిసహస్ర, వర్రి నరిసింహమూర్తి, జైహింద్‌కుమార్, ఐవీపీ రాజు, కనకల మురళీమోహన్, తదితరులు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. సిరి సహస్ర నూతన దంపతులకు పట్టు వస్త్రాలు అందజేశారు.

వారి విజయం.. ఆదర్శం

వారిద్దరూ అన్నదమ్ములు. పోటీ పడి చదివారు. కొలువులు సాధించారు. దేశ రక్షణ రంగంలో కీలకమైన ఉద్యోగాలు సాధించారు. నేటి నిరుద్యోగ యువతకు ఆదర్శంగా నిలిచారు. వారే తెర్లాం మండలం ఆమిటి గ్రామానికి చెందిన పెద్దింటి హేమంత్, హిమగిరి. వివరాల్లోకి వెళ్తే...

- అన్నదమ్ముల విజయ కేతనం
- తమ్ముడు ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో పైలట్
- అన్న ఇండియన్ ఆర్మీలో లెఫ్టినెంట్ అధికారి



ఆర్మీ, ఎయిర్స్ ఫోర్స్‌లో ఉద్యోగాలు సాధించిన పెద్దింటి హిమగిరి, హేమంత్

తెర్లాం: తెర్లాం మండలం ఆమిటి గ్రామానికి చెందిన పెద్దింటి గౌరీశంకరరావు, లత దంపతులకు ఇద్దరు కుమారులు. అన్న హిమగిరి, తమ్ముడు హేమంత్. తండ్రి గౌరీశంకరరావు 21 సంవత్సరాల పాటు స్కూల్ అసిస్టెంట్‌గా పని చేసి కొన్నాళ్ల కిందట అనారోగ్యంతో మృతి చెందారు. తల్లి లత ప్రస్తుతం విజయనగరం డైట్ కళాశాలలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నారు. పెద్దింటి హేమంత్ ఇంటర్మీడియట్ వరకు విజయనగరం జిల్లా కోరుకొండ సైనిక్ స్కూల్‌లో చదివి ఎన్‌డీఏ రిక్రూట్‌మెంట్‌లో తొలి ప్రయత్నంలోనే ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో పైలట్‌గా ఎంపికయ్యాడు. పూణేలో పైలట్‌గా శిక్షణ పూర్తి చేసుకొని ప్రస్తుతం ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ శిక్షణ కేంద్రం దుండిగల్ – సికింద్రాబాద్‌లో ఫ్లయింగ్ ఆఫీసర్ అండర్ కమిషనర్‌గా శిక్షణ పొందుతున్నాడు. హిమగిరి 1వ తరగతి నుంచి 12వ తరగతి వరకు వివిధ ప్రైవేటు పాఠశాలల్లో విద్యనభ్యసించాడు. బీటెక్ నిట్ నాగపూర్‌లో సివిల్ ఇంజినీరింగ్ చదువుకున్నాడు. ఇటీవల జరిగిన ఎస్ఎస్‌సీ టెక్ 64 రిక్రూట్‌మెంట్‌లో ఇండియన్ ఆర్మీలో సివిల్ విభాగంలో ఆల్ ఇండియా స్థాయిలో 21వ ర్యాంక్ సాధించాడు. ఇండియన్ ఆర్మీలో లెఫ్టినెంట్‌గా నియమితులయ్యాడు. ఈ నెల 27న శిక్షణ నిమిత్తం బిహార్‌లోని గయాలో గల ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీకి వెళ్లనున్నాడు. హిమగిరి ప్రస్తుతం సికింద్రాబాద్‌లోని టాటా ప్రాజెక్టు లిమిటెడ్ కంపెనీలో సివిల్ ఇంజనీర్‌గా పని చేస్తున్నాడు.

గ్రామంలో సంబరం

పెద్దింటి హేమంత్, హిమగిరి అన్నదమ్ములిద్దరూ దేశ రక్షణ రంగంలో కొలువులు సాధించడంతో అటు కుటుంబ సభ్యులు, ఇటు గ్రామస్తులు సంబరపడుతున్నారు. కష్టపడి చదివితే సాధ్యం కానిది లేదని నిరూపించారని అందరూ కొనియాడుతున్నారు. ఈ యువకులు అందరికీ ఆదర్శమని పేర్కొంటున్నారు.

మన్యం సహజ రైతు ఉత్పత్తిదారుల కంపెనీకి జాతీయ అవార్డు



అవార్డు అందుకుంటున్న రైతు ఉత్పత్తిదారుల కంపెనీ ప్రతినిధులు సన్యాసిరావు, శంకరరావు

సీతంపేట: మన్యం సహజ రైతు ఉత్పత్తిదారుల కంపెనీకి జాతీయ స్థాయి అవార్డు లభించింది. ఈ మేరకు అవార్డును కేరళ రాష్ట్రంలోని త్రిశూర్‌లో శనివారం జరిగిన ఒక కార్యక్రమంలో ఆర్‌బీఐ ప్రతినిధి సతీష్ కె.మల్హోత్ర, ఈఎస్ఏఎఫ్ ఫౌండర్ పాల్ జోషెఫ్ చేతుల మీదుగా రూ.లక్ష నగదు బహుమతి, ప్రశంసా పత్రాన్ని ఆర్ట్స్ డైరెక్టర్ నూక సన్యాసిరావు, మన్యం సహజ రైతు ఉత్పత్తిదారుల కంపెనీ సీఈఓ బెండి శంకరరావు అందుకున్నారు. ఆర్ట్స్ నేతృత్వంలో మన్యంలోని గిరిజన రైతులు సహజ ఉత్పత్తులను సాగు చేస్తూ అందరి ప్రశంసలు అందుకుంటున్నారు. తాజాగా జాతీయ స్థాయిలో ఈ అవార్డు రావడం పట్ల పలువురు అభినందించారు.

క్రీడాకారులకు అభినందనలు



రాష్ట్ర స్థాయి పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందిస్తున్న కలెక్టర్, ఎంపీ, ఎమ్మెల్యే

విజయనగరం: గత నెలలో మంగళగిరిలో జరిగిన 7వ పారా రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరచిన జిల్లాకు చెందిన క్రీడాకారులను పలువురు ప్రజాప్రతినిధులు శనివారం అభినందించారు. నగరంలోని రాజీవ్ క్రీడామైదానం ప్రాంగణంలో గల జిల్లా క్రీడాప్రాధికార సంస్థ కార్యాలయంలో జరిగన కార్యక్రమంలో కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే అతిధి గజపతిరాజులు క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అతిధి గజపతిరాజు మాట్లాడుతూ.. ప్రతిభకు వైకల్యం అడ్డుకాదన్న విషయాన్ని పారా క్రీడాకారులు నిరూపిస్తున్నారని, ఇతర క్రీడాకారులకు ఏ మాత్రం తీసిపోని విధంగా మెడల్స్ సాధించడమే కాకుండా రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లాను రెండో స్థానంలో నిలపడం అభినందనీయమన్నారు. భవిష్యత్‌లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరింతగా రాణించాలని ఆకాంక్షించారు. అనంతరం విజేతలకు మెడల్స్ వేసి, మెరిట్ సర్టిఫికెట్స్ అందజేశారు. కార్యక్రమంలో తూర్పుకాపు కార్పొరేషన్ చైర్ పర్సన్ పాలవలస యశస్విని, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి వెంకటేశ్వరరావు, పారా స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు కె.దయానంద్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అత్యుత్తమ సేవలందించాలి : ఎస్పీ



మాట్లాడుతున్న ఎస్పీ మాధవ్‌రెడ్డి



ప్రాక్టికల్ శిక్షణ నిమిత్తం జిల్లాకు చేరుకున్న ప్రొబేషనరీ ఎస్ఐలు

పార్వతీపురం రూరల్: అనంతపురం పోలీసు శిక్షణ కళాశాలలో శిక్షణ పూర్తి చేసుకున్న అనంతరం గుంటూరు, కర్నూల్ రేంజ్‌కు సంబంధించిన 35మంది ప్రొబేషనరీ ఎస్ఐలను ప్రాక్టికల్ శిక్షణ నిమిత్తం పార్వతీపురం మన్యం జిల్లాకు కేటాయించారు. ఈ సందర్భంగా జిల్లా పోలీసు శాఖ కార్యాలయంలో శిక్షణ నిమిత్తం వచ్చిన ఎస్ఐలు ఎస్పీ మాధవ్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా శనివారం కలిశారు. ఈ నేపథ్యంలో ఎస్పీ వారితో మాట్లాడుతూ ప్రజలకు పోలీసు శాఖ ద్వారా అత్యుత్తమ సేవలందించాలన్నారు. విధి నిర్వహణలో నిర్భయంగా, నిష్పక్షపాతంగా, క్రమశిక్షణ, నిజాయితీ, పారదర్శకత, జవాబుదారీతనంగా సేవలందించాలన్నారు. ప్రతీ ఒక్కరు ఈ శిక్షణలో టెక్నాలజీని ఉపయోగించి ఉత్తమ ఫలితాలను రాబట్టి పోలీసు శాఖ ప్రజలకు మరింత సేవలందించేలా చూడాలని సూచించారు. ఫిర్యాదుదారులతో మృదు స్వభావంతో మెలగాలన్నారు. ఎఫ్ఐఆర్ దర్యాప్తుకు సంబంధించిన రికార్డులు రాయడం గురించి క్షుణ్ణంగా తెలుసుకొని, కేసులను ఏ విధంగా ఛేదించాలి, సీసీటీఎన్ఎస్, డ్రోన్స్‌ను ఉపయోగించడం, పెట్రోలింగ్, సీసీ కెమెరాలను ఉపయోగించు విధానం, పహారా బీట్ గురించి ఎన్‌డీపీఎస్ కేసులలో చేయాల్సిన విధులు, కేసు డైరీ రాయడం, నేర స్థల పరిశీలన, పోలీసు బందోబస్తు ఏ విధంగా నిర్వహించాలో క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. ఏ విధమైన అనుమానాలు వ్యక్తమైనా సీనియర్ అధికారులను అడిగి తెలుసుకొని నివృత్తి చేసుకోవాలని ఎస్పీ సూచించారు. ఈ సందర్భంగా వారికి క్షేత్ర స్థాయిలో నిర్వహించాల్సిన విధులపై అవగాహన కల్పించేందుకు జిల్లాలో ఉన్న పలు పోలీసుస్టేషన్లకు కేటాయించారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



నేలకొరిగిన జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల ప్రహరీ

పాలకొండ రూరల్: నిత్యం రద్దీగా ఉండే స్థానిక ప్రధాన మార్కెట్‌కు ఆనుకుని ఉన్న జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ప్రహరీ గోడ ఒక్కసారిగా నేలకొరిగింది. నెలలో రెండవ శనివారం పాఠశాలకు సెలవు కావటం, గోడకు మరోవైపు ఉన్న మార్కెట్‌లో ఆ సమయంలో ఎవ్వరూ లేకపోవటంతో పెద్ద ప్రమాదమే తప్పింది. ఉన్నట్లుండి పెద్ద శబ్దంతో ఈ భారీ గోడ కూలటంతో చుట్టపక్కల వారు అక్కడి చేరుకుని పరిస్థితిని పాఠశాల యాజమాన్యానికి తెలియజేశారు. ఈ ఘటనతో ఎటువంటి సమస్య తలెత్తకపోవటంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. విషయం తెలుసుకున్న పాఠశాల హెచ్‌ఎం బి.శ్రీదేవి శాఖాపరమైన ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతామన్నారు.

గడ్డి మందు తాగి వ్యక్తి మృతి

మక్కువ : మండలంలోని పాయకపాడు గ్రామానికి చెందిన సామంతుల స్వామినాయుడు (29) మనస్తాపంతో గడ్డి మందు తాగి, వైద్య చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం స్వామినాయుడు ఈ నెల 6వ తేదీన ఉదయం ఇంటి వద్ద గడ్డి మందు తాగడంతో స్థానికులు గమనించి మక్కువలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం నిమిత్తం విజయనగరం మహారాజ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. గత కొంతకాలంగా ఏ పని చేయకుండా ఖాళీగా ఉండడంతో కుటుంబ సభ్యులు మందలించారు. దీంతో మనస్తాపానికి గురైన స్వామి నాయుడు గడ్డి మందు తాగాడు. మృతుడికి వివాహమై ఏడాదైంది. భార్య శిరీష ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్ఐ ఎం.శ్రీనివాసరావు తెలిపారు.

హెల్త్‌సిటీలో రక్త రుగ్మతల కేంద్రం ప్రారంభం



హెల్త్‌సిటీ యునిక్ ఆస్పత్రిలో రక్త రుగ్మతల సంస్థ ప్రారంభిస్తున్న హెమటాలజీ పితామహుడు డాక్టర్ మామ్మెన్ చాందీ

ఆరిలోవ: హెల్త్‌సిటీ యునిక్ ఆస్పత్రిలో మహాత్మా గాంధీ క్యాన్సర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో రక్త రుగ్మతుల కేంద్రం అందుబాటులోకి వచ్చింది. ఈ కేంద్రాన్ని హెమటాలజీ పితామహుడు డాక్టర్ మామ్మెన్ చాందీ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో సికిల్ సెల్, తలసేమియాతో బాధపడుతున్న వారు ఎక్కువగా ఉన్నారన్నారు. అలాంటి వారికి ఈ కేంద్రం ఉపయోగపడుతుందన్నారు. పేదలకు వైద్యం అందుబాటులో ఉండే విధంగా ఈ కేంద్రాన్ని నిర్వహించాలని నిర్వాహకులకు సూచించారు. రాష్ట్రంలో మొట్టమొదటిసారిగా ఈ కేంద్రం విశాఖలో ఏర్పాటు చేసిన మహాత్మా గాంధీ క్యాన్సర్ ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఊన్న మురళీకృష్ణను అభినందించారు. నిమ్స్ మెడికల్ ఆంకాలజీ విభాగాధిపతి డాక్టర్ సదాశివుడు మాట్లాడుతూ విశాఖలో రక్త రుగ్మతుల కేంద్రం ఏర్పాటు చేయడం వల్ల ఆరోగ్య సంరక్షణలో కీలక ముందుడుగు పడిందన్నారు. దీర్ఘకాలిక వ్యాధులు ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయన్నారు. అలాంటి సమస్యల నివారణకు ఈ కేంద్రం అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమన్నారు. మేనేజింగ్ డైరెక్టర్ మురళీకృష్ణ మాట్లాడుతూ ఏపీతోపాటు ఒడిశా, చత్తీస్‌గఢ్‌లలో ఎక్కడా రక్త వ్యాధులను సమగ్రంగా నిర్వహించేందుకు ప్రత్యేకంగా హెమటాలజీ కేంద్రం లేదన్నారు. ఈ లోటును భర్తీ చేయడానికి ఇక్కడ సమగ్ర రక్త రుగ్మతల కేంద్రం ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో పలువురు ఆంకాలజీ విభాగం వైద్యులు పాల్గొన్నారు.

ఎన్‌డీఏకు ఎంపికైన విద్యార్థులకు సత్కారం



విద్యార్థులకు జ్ఞాపికలు అందిస్తున్న ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్ శాస్త్రి, కిరణ్‌లు



ఎన్‌డీఏకు ఎంపికైన విద్యార్థుల విజయోత్సవం

విజయనగరం రూరల్: కోరుకొండ సైనిక పాఠశాలలో విద్యనభ్యసించి, సర్వీసెస్ సెలక్షన్ బోర్డు (ఎస్ఎస్‌బీ) నిర్వహించిన ఎంపిక పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి, జాతీయ రక్షణ అకాడమీ (ఎన్‌డీఏ)లో చేరనున్న 8 మంది విద్యార్థులను కోరుకొండ సైనిక పాఠశాలలో శనివారం ఘనంగా సత్కరించారు. పాఠశాల ప్రిన్సిపాల్, గ్రూప్ కెప్టెన్ ఎస్ఎస్ శాస్త్రి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ 63 ఏళ్ల పాఠశాల చరిత్రలో దేశానికి 744 మందికి పైగా రక్షణ అధికారులను అందించిన ఘనత కోరుకొండ సైనిక పాఠశాల సాధించడం గర్వకారణమని అన్నారు. దేశ రక్షణ రంగంలో ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్ విభాగాల్లో అనేక మంది పాఠశాల పూర్వ విద్యార్థులు వివిధ హోదాల్లో సేవలు అందించారని, ప్రస్తుతం అందిస్తున్నారని అన్నారు. ఎన్‌డీఏ, ఐఎన్ఏలో చేరడమే లక్ష్యంగా పాఠశాలలో శిక్షణ అందించడం జరుగుతుందన్నారు. సీనియర్లను ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు అనుకున్న లక్ష్యాలను సాధించాలని కోరారు. విద్యార్థుల విజయాల్లో భాగమైన అధికారులు, ఉపాధ్యాయ సిబ్బందిని ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఎన్‌డీఏకు ఎంపికైన విద్యార్థులు శిరీష్ శాస్త్రి, వర్షిత్ వర్ధన్, వై.తేజేశ్వర్, చల్ల కృష్ణకుమార్, రూపేశ్ రోణంకి, ఎం.రోహిత్‌కుమార్, ఎస్.గీత్‌పవన్, కె.భార్గవ్‌లను సత్కరించి అభినందించి జ్ఞాపికలను అందించారు. కార్యక్రమంలో పాఠశాల వైస్ ప్రిన్సిపాల్, వింగ్ కమాండర్ కిరణ్ వి.పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు ఎన్.రామకృష్ణ, అధికారులు, సిబ్బంది, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి వేంకటేశ్వరుని కల్యాణోత్సవం

- ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయ కమిటీ



ఆలయంలో శ్రీదేవి, భూదేవి సహిత వేంకటేశ్వరస్వామి

డెంకాడ: చింతలవలస ఐదవ ఏపీఎస్పీ బెటాలియన్ వద్ద ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో వేంచేసి ఉన్న వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవానికి ఆలయ కమిటీ ఏర్పాట్లు పూర్తి చేసింది. స్వామివారి 41వ వార్షిక కల్యాణ మహోత్సవాలు ఈ నెల 9వ తేదీ నుంచి 12వ తేదీ వరకూ శ్రీనివాసుని కల్యాణ ఉత్సవాలు జరుగుతాయని ఆలయ కమిటీ తెలిపింది. 9వ తేదీ ఉదయం నుంచి స్వామివారి కల్యాణ ఉత్సవ పూజలు ప్రారంభమై సాయంత్రం 4.30 గంటలకు శ్రీవారి తిరువీధి ఉత్సవం జరుగుతుందని వివరించారు. 10వ తేదీన సాయంత్రం 6.30 గంటలకు వేదపండితుల ఆధ్వర్యంలో శ్రీవారి కల్యాణ మహోత్సవం నిర్వహిస్తారు. 11వ తేదీ సాయంత్రం 7 గంటలకు ఆలయ ప్రాంగణంలో ఉన్న కోనేరులో తెప్పోత్సవం కన్నుల పండువగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. 12వ తేదీ మధ్యాహ్నం 12 గంటల నుంచి అన్న సమారాధన జరుగుతుందని కమిటీ తెలిపింది. భక్తులు పాల్గొని స్వామి ప్రసాదాన్ని స్వీకరించాలని వారు కోరారు. ఉత్సవంలో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలు కూడా జరుగుతాయన్నారు.

లోక్ అదాలత్‌లో.. 6,677 కేసుల పరిష్కారం



మోటార్ ప్రమాద బీమా క్లెయిమ్‌కు సంబంధించిన కేసులో రూ.70 లక్షల పరిహారం చెక్కును అందజేస్తున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయికళ్యాణ్‌చక్రవరి

కోర్టుల వారీగా రాజీ అయిన కేసులు ఇలా...

కోర్టు	రాజీ అయిన కేసుల సంఖ్య
విజయనగరం	3,357
పార్వతీపురం	416
బొబ్బిలి	1,114
సాలూరు	378
శంగవరపుకోట	226
గజపతినగరం	321
చీపురుపల్లి	571
కొత్తవలస	238
కురుపాం	56

విజయనగరం లీగల్: ఉమ్మడి విజయనగరం జిల్లాలోని విజయనగరం, పార్వతీపురం, బొబ్బిలి, సాలూరు, శృంగవరపుకోట, చీపురుపల్లి, గజపతినగరం, కొత్తవలస, కురుపాం కోర్టులలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లలో 6,677 కేసులు పరిష్కరించినట్టు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయికళ్యాణ్ చక్రవర్తి తెలిపారు. రాజీయే రాజమార్గమని తెలిపారు. మోటారు ప్రమాద బీమా క్లెయిమ్‌లకు సంబంధించిన కేసులో రూ.70 లక్షల పరిహారాన్ని అందజేసినట్టు వెల్లడించారు. సుమారు రూ.35 కోట్ల ఆస్తులకు సంబంధించిన (విలువైన) కేసులు పరిష్కారమయ్యాయన్నారు. 10,500 మంది కక్షిదారులు ప్రయోజనం పొందినట్టు తెలిపారు. లోక్ అదాలత్‌లలో వివిధ కోర్టుల న్యాయమూర్తులు, జడ్జిలు బి.అప్పలస్వామి, ఎస్.పద్మావతి, కె.నాగమణి, టి.వి.రాజేష్‌కుమార్, బీహెచ్‌వీ లక్ష్మీకుమారి, ఎల్.దేవీరత్నకుమారి, బి.రమ్య, పి.బుజ్జి, ఎమ్.శ్రీనివాసరావు, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎ.హరీష్ తదితరులు పాల్గొన్నారు.

రాజీతోనే కేసుల పరిష్కారం



కేసులు రాజీ పరుస్తున్న రెండవ అదనపు జిల్లా జడ్జి దామోదరరావు

పార్వతీపురం టౌన్: రాజీతోనే ఎక్కువ శాతం కేసులు పరిష్కారం అవుతాయని రెండవ అదనపు జిల్లా జడ్జి ఎస్.దామోదరరావు అన్నారు. స్థానిక జిల్లా కోర్టుల సముదాయంలో శనివారం ఏర్పాటు చేసిన మెగా లోక్ అదాలత్‌తో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసులు పరిష్కారానికి ఇరువర్గాల సభ్యుల రాజీ ఎంతో అవసరమని తెలిపారు. వివాదాలు ఒకసారి ప్రారంభం అయితే జీవితాంతం కొనసాగుతాయని, వాటిని సత్వరమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కక్షిదారులకు విజ్ఞప్తి చేశారు. సంవత్సరాల తరబడి కేసుల వెంట వెళ్లేకన్నా రాజీ మార్గాన్ని ఎంచుకోవాలని సూచించారు. న్యాయ స్థానాల్లో పెండింగ్‌లో వున్న కేసుల సంఖ్యను తగ్గించుకోవడానికి, వ్యాజ్యాలకు ముందు దశలోనే వివాదాలను పరిష్కరించడానికి న్యాయస్థానాలు లోక్ అదాలత్‌ను తీసుకువచ్చాయన్నారు. కార్యక్రమంలో అదనపు జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ సౌమ్య జోస్పిన్, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎస్ఎస్ రావు, అదనపు పీపీ చంద్రకుమార్, న్యాయవాదులు, కక్షిదారులు పాల్గొన్నారు.

అంబరాన్నంటిన ఎల్లమ్మ సంబరం...

- భక్తి శ్రద్ధలతో సిరిమానోత్సవం
- తరలివచ్చిన వేలాది మంది భక్తులు




సిరిమాను ఊరేగింపు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సతివాడలో ఎల్లమ్మ తల్లి జాతర శనివారం ఘనంగా జరిగింది. వేకువజాము నుంచే భక్తులు తండోపతండాలుగా తరలివచ్చి పెద్ద ఎల్లమ్మ తల్లి అలాగే పక్కనే ఉన్న చిన్నమ్మ తల్లిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం డప్పు వాయిద్యాల నడుమ ఎల్లమ్మ తల్లిని చదురు నుంచి గ్రామ పొలిమేర వరకు మూడుసార్లు ఊరేగించారు.

సిరిమానోత్సవాన్ని పోటెత్తిన భక్తులు

చుట్టు పక్కల ఉన్న 20 గ్రామాల నుంచి భక్తులు తండోపతండాలుగా తరలివచ్చి ఎల్లమ్మతల్లి సిరిమానోత్సవాన్ని కనులారా తిలకించి పసుపు, కుంకుమలను సమర్పించుకున్నారు. గ్రామానికి చెందిన సబ్బవరపు అచ్యుతరావు పూజారిగా సిరిమానును అధిరోహించారు. ఎల్లమ్మ తల్లి చదురు నుంచి సతివాడ జంక్షన్ వరకు సిరిమానోత్సవం చేపట్టారు. కార్యక్రమంలో సర్పంచ్ రేవళ్ల శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యుడు రెడ్డి సత్యనారాయణ, నాయకులు కోరాడ శ్రీను, ఆల్తి నల్లి బాబు, తదితరులు పాల్గొన్నారు.

పుష్పాలంకరణలో శ్రీనివాసుడు..



విజయనగరంలోని టీటీడీ కళ్యాణ మండపం ఆవరణలో కొలువైన వేంకటేశ్వరస్వామి శనివారం పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధానార్చకుడు పీవీ నరసింహాచార్యుల ఆధ్వర్యంలో వేకువజాము నుంచి స్వామివారికి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం పుష్పాలంకరణలో సర్వాంగ సుందరంగా అలంకరించారు.

– విజయనగరం టౌన్